క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లలోని గుంతబజార్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ పుల్లయ్యయాదవ్, నాయకులు దామోదర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ బషీర్, రజాక్, పెంచలస్వామి, వీరాస్వామి పాల్గొన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



కొండాపురం: కొండాపురం ఎస్సైగా డీ మహేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల ఎస్సైగా పనిచేస్తున్న షేక్ ఖాజావలి ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బుచ్చిరెడ్డిపాళెంలో ఇన్‌చార్జి ఎస్సైగా పనిచేస్తున్న డీ మహేంద్రను కొండాపుం ఎస్సైగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

రైస్‌మిల్లు ప్రారంభం



జలదంకి: బ్రాహ్మణక్రాకలో ఆదిరెడ్డిపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సోము నాగేశ్వరరెడ్డి నూతనంగా నిర్మించిన రైస్‌మిల్లును ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సేవలు అందించాలని, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం జలదంకిలోని శ్రీజానకీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వాకా శ్రీనివాసులరెడ్డి, సభ్యుడు వాకా మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

వరికుంటపాడు: గువ్వాడి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు..గ్రామానికి సమీపంలో ఉన్న పాఠశాలకు ఉపాధ్యాయులు రోజూలాగే బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని తాళాలు వేసుకుని వెళ్లారు. గురువారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తలుపులు తెరిచి ఉండడం గమనించి చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై తిరుపతయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. 8 ఫ్యాన్లు, చిక్కీల ప్యాకెట్లు, రాగిపిండి చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

న్యాయమూర్తి బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్‌గా భారతి సిద్ద గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నెల్లూరులో ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన న్యాయమూర్తిని పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

క్రమశిక్షణతో మెలగాలి

ఉదయగిరి: విద్యార్థులు సమాజంలో క్రమశిక్షణతో మెలగాలని ఉదయగిరి సీఐ వీ గిరిబాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. ఎస్సై కర్నాటి ఇంద్రాసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెంచీల బహూకరణ

ఆత్మకూరు: పట్టణంలోని పోలీసుస్టేషన్‌తో పాటు పోలీసు క్వార్టర్స్‌కు డాక్టర్ వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రజావైద్యశాల ఎండీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ ప్రణీత్ చౌదరి పన్నెండు సిమెంట్ బెంచీలను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా సీఐ వేణు మాట్లాడుతూ దాత ప్రణీత్ చౌదరి గతంలో పోలీసు సిబ్బందికి దుస్తులు అందించారని తెలిపారు. ప్రస్తుతం స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల కోసం సిమెంటు బెంచీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం దాతను సీఐ, ఎస్సై ముత్యాలరావు శాలువాతో సన్మానించారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న ఎన్నికల సంగ్రామంలో ప్రతిపక్షాలన్నీ ఏకమై వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. విజయీభవ యాత్రలో భాగంగా మండలం నీలాయపాళెం పంచాయతీలో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూరుశాతం నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ వైఎస్సార్సీపీని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక ప్రతిపక్షాలన్నీ ఏకమై వస్తున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు బాటలు వేయాలన్నారు. అనంతరం గడప గడపకు జగనన్న, విక్రమన్న సందేశం కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, నీలాయపాళెం సర్పంచ్ వెంకయ్యనాయుడు, బూత్ కమిటి కన్వీనర్ మానికల చందన్ కుమార్, జెసీయస్ కన్వీనర్ ముడి మల్లికార్జునరెడ్డి, పీయేసీయస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేవాదాయశాఖ ద్వారా ఆలయాల నిర్మాణాలకు నిధులను విడుదల చేస్తుండడంతో గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్నాయని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నీలాయపాళెంలో దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ నిధులతో సీతారామ మందిరం పునఃనిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సోమశిలలోని సోమేశ్వరాలయం జీర్ణోద్ధరణ పనులకు తమ సొంత నిధులు రూ.50లక్షలు అందజేశామని చెప్పారు. ఈ నిధులతో ఆలయ గాలిగోపురం నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. నీలాయపాళెం గ్రామపెద్దలు రామ మందిర పునర్నిర్మాణ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంతో దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధులు రూ.50లక్షలు మంజూరు చేయించినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, నీలాయపాళెం సర్పంచ్ వెంకయ్యనాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ మానికల చందన్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ ముడి మల్లికార్జునరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, కరీముల్లా, అనిల్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

కలికి విగ్రహ పునఃప్రతిష్టకు చర్యలు



కలికి విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ధాన్యం లోడు లారీ కారణంగా పక్కకు ఒరిగిన ఉదయగిరి బ్రిడ్జి కూడలిలోని మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి విగ్రహాన్ని వీలైనంత త్వరగా పునఃప్రతిష్ఠ చేస్తామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి కూడలిలోని మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి విగ్రహం ధాన్యం బుధవారం అర్ధరాత్రి పక్కకు ఒరిగింది. ధాన్యం లోడు లారీ కారణంగా కేబుల్ వైర్లు బలంగా తాకడంతో విగ్రహం బేస్‌కు ఉన్న బోల్టులు విరిగి పక్కకు ఒరిగింది. గురువారం వేకువన కలికి అభిమానులు గుర్తించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పక్కకు ఒరిగిన కలికి విగ్రహాన్ని పరిశీలించారు. ఘటనకు సంబంధించి పోలీసులను ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం లోడు లారీ కారణంగా కలికి విగ్రహ బేస్ బోల్టులు విరిగిపోయి పక్కకు ఒరిగిందని తెలిపారు. అందుకు సంబంధించి సీసీ కెమెరాల్లో సైతం రికార్డు అయిందన్నారు. కలికి అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వీలైనంత త్వరగా విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు అందించడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకపాటి పాల్గొని దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు సంబంధించిన వలంటీర్లను సత్కరించి సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు, గడప గడపకు సంక్షేమ ఫలాలను అందజేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సేవలు అందించి రెండు వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందించారని కొనియాడారు. వలంటీర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వం ఏటా సేవా పురస్కారాలను అందజేస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. వలంటీర్లు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు తుమ్మల వెంగయ్యచౌదరి, ఆంజనేయులు, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల పార్టీ అధ్యక్షులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, తిరుపతినాయుడు, సర్పంచ్‌లు యనమల సుబ్బమ్మ, దిలీప్‌కుమార్, ఆదెమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, దుత్తలూరు, వరికుంటపాడు ఎంపీడీఓలు సురేష్‌బాబు, వెంకటకృష్ణకుమారి, నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి, శ్రీహరినాయుడు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



మర్రిపాడులో ప్రచారం చేస్తున్న శ్రీనివాసులునాయుడు



ఆత్మకూరు: ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ

ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని జెడ్పీటీసీ పెయ్యల ప్రసన్నలక్ష్మి కోరారు. గురువారం ఆమె అప్పారావుపాళెం సచివాలయం పరిధిలోని ఇంటింటికి తిరిగి జగనన్న–విక్రమన్న సందేశ కరపత్రాలను అందజేశారు. సచివాలయ కన్వీనర్ హజరత్‌నాయుడు, గృహసారథులు మంజాన్ బాషా, కృష్ణవేణి, సావిత్రి, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్‌లెవల్ ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో గడప గడపకు జగనన్న–విక్రమన్న సందేశం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గురువారం శ్రీకారం చుట్టారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటన

చేజర్ల: మండలంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. విజయీభవ యాత్రలో భాగంగా నెర్నూరు సచివాలయ పరిధిల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉదయగిరి: పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ పొందిన సయ్యద్ తాహెర్‌అలీ హుస్సేని(కలీం)ను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. 33 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా అందించిన సేవలను కొనియాడారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట

దుత్తలూరు: నందిపాడు సెంటర్‌లోని నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం విశేష పూజలు, హోమాలు చేశారు. అనంతరం యంత్ర, విగ్రహ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ, సర్వదర్శనం, బింబకలాన్యాసం, బలిప్రదానం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు వలంటీర్లకు వందనం

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ గురువారం తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేస్తారని వివరించారు. వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

కావలి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు కళాశాలలోని వసతులను పరిశీలించారు. అనంతరం కావలి ఆర్డీఓ శీనానాయక్‌కు సూచనలు చేశారు. ఎన్నికల విధులకు వచ్చే సిబ్బందికి అవసరమైన వసతులకు సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయాన్ని పరిశీలించి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థులు వేచి ఉండే గదుల్లో అనువుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



దుత్తలూరు: మండల నూతన ఎంపీడీఓగా కే సురేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పెళ్లకూరులో పనిచేస్తున్న ఆయన ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తున్న సాయిప్రసాద్ ఈఓపీఆర్డీగా కొనసాగనున్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



మేకపాటికి స్వాగతం పలుకుతున్న మహిళలు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా మండలంలోని డక్కునూరు, తూర్పురొంపిదొడ్ల గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు తాత్కాలిక ప్రలోభాలకు లొంగి మోసపోవద్దన్నారు. చిన్నపొరపాటు చేసినా ఐదేళ్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. 2019 ఎన్నికల తర్వాత పత్తా లేకుండా పోయిన టీడీపీ నాయకులకు ఇప్పుడు ప్రజలు గుర్తుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా సమయంలో ఈ నాయకులు ఎక్కడున్నారని, ఇప్పుడే ప్రజలు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేక ప్రతిపక్షాలన్నీ ఏకమై వస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేసి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తూ ఉదయగిరి ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తూర్పుకొండారెడ్డిపల్లిలో టీడీపీకి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జీ రామాంజనేయులు, డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బీ వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆలీఅహ్మద్, నాయకులు బీ వెంకటనారాయణరెడ్డి, ఆర్ మధుసూదన్‌రావు, డీ చెన్నారాయుడు, టీ తిరుపతయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు జిలానీబాషా, ఎం తిరుపతినాయుడు, ఎం.శ్రీనివాసులు, ఓబయ్య, మల్లికార్జున, బీ కొండమ్మ, ఆవులయ్య, తదితరులు పాల్గొన్నారు.

భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రాజెక్టులను తిలకిస్తున్న డిప్యూటీఈఓ

మర్రిపాడు: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఉపవిద్యాశాఖ అధికారి రఘురామయ్య అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పొలిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లను తిలకించారు. ఉత్తమ ప్రాజెక్ట్‌లను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈఓ ధనలక్ష్మి, హెచ్‌ఎం హరికృష్ణ, సర్పంచ్ నరసింహారావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



దుత్తలూరులో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న దృశ్యం

ఉదయగిరి: పట్టణంలోని ఏఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి జరుగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు ఏ రమణ, కమలహాసన్ తెలిపారు. గురువారం వారు ఇన్విజిలేటర్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరీక్షలకు 355 మంది ప్రథమ, 330 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్షలకు 12 గదులను ఏర్పాటు చేసి 15 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు.

కొండాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ శ్రీహరి గురువారం తెలిపారు. పరీక్షలకు 240 మంది ప్రథమ, 156 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరవుతున్నారని వివరించారు.

దుత్తలూరు: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 120 మంది ఇంటర్, 53 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 148 మంది ఇంటర్, 72 మంది ఒకేషనల్, ప్రైవేట్ విద్యార్థులు మరో 14 మంది చొప్పున మొత్తం 234 మంది హాజరుకానున్నట్లు ప్రిన్సిపల్ సైమన్‌రావు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎం.బీబీశీల, డిపార్ట్‌మెంటల్ అధికారిగా జమున వ్యవహరించనున్నారు.

ఎంఈఓగా కళాధర్ సేవలు మరువలేనివి



చేజర్ల: మండల ఎంఈఓగా కళాధర్ అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల ఎంఈఓ–1 పంచాగ్నుల కళాధర్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా చేజర్ల మెయిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎంఈఓ ఉద్యోగ విరమణ సభకు ఎంపీపీ హాజరై ఎంఈఓగా కళాధర్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఎంఈఓ దంపతులను ఘనంగా సత్కరించారు. ఏఎంఓ సు దీర్‌బాబు, ఎంఈఓ–2 మస్తానయ్య, రావి పెంచలరెడ్డి, యనమదల సర్పంచ్ సుందరరామిరెడ్డి, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.7.14 కోట్లతో మున్సిపల్ బడ్జెట్





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, బడ్జెట్ చదివి వినిపిస్తున్న కమిషనర్ ఫజులుల్లా

ఆత్మకూరు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ బడ్జెట్‌ను రూ.7,14,58,341తో రూపొందించారు. బడ్జెట్ ప్రారంభ నిల్వగా రూ.5,58,44,141 చూపారు.మున్సిపల్ సమావేశ మందిరంలో బడ్జెట్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా బడ్జెట్‌ను చదివి వినిపించారు. అనంతరం బడ్జెట్‌పై కౌన్సిలర్లు చర్చించారు. కొద్దిసేపు ప్రారంభ నిల్వపై కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. అనంతరం కమిషనర్ వివరణతో బడ్జెట్‌ను ఆమోదించారు.

- బడ్జెట్‌లో ఆస్తి, సాధారణ పన్నుల రాబడి రూ.2.58 కోట్లు, ఖాళీ స్థలాలపై పన్ను రాబడి రూ.6.80 లక్షలు, ప్రభుత్వ ఆస్తులపై పన్ను రాబడి రూ.8.50 లక్షలుగా చూపారు. భవన సముదాయాల అద్దెల ద్వారా రూ.29 లక్షలు, మార్కెట్ గదుల అద్దెల ద్వారా రూ. 8.80 లక్షలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు.
- పారిశుధ్యాన్ని అధిక ప్రాధాన్యత ఇస్తూ చెత్తను తరలించే ట్రాలీలు, వాహనాల మరమ్మతులకు నిధులు, పారిశుధ్య పనులకు మరో 15 మంది కార్మికులను రోజువారీ వేతనం కింద ఏడాది పాటు నియమించుకునేందుకు బడ్జెట్‌లో ఆమోదం తెలిపారు.
- ఎల్‌ఈడీ దీప స్తంభాలకు మరమ్మతులు, వాటి చుట్టూ సీరియల్ ఎలక్ట్రికల్ బల్బులు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.
- ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు.
- మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద నివాసదారులు సొంతంగా బోర్ల నిర్మాణం, ఇండస్ట్రీయల్ పార్కుకు పాత జంగాలపల్లి నుంచి పైపులైన్ ద్వారా నీటి సరఫరా అంశాలను ఆమోదించలేదు. అజెండాలోని మొత్తం 82 అంశాలను సభ్యులు ఆమోదించడంతో బడ్జెట్ సమావేశం ముగిసింది. మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్ఐ ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.